

'రోడ్డు కబ్జాపై పట్టించుకోని కమిషనర్'

శంషాబాద్, ఫిబ్రవరి 6: రోడ్డును కబ్జా చేస్తున్నా మునిసిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదని 14వ వార్డు వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. రాళ్లగూడకు చెందిన ప్రవీణ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మరి కొందరు సర్వే నం:527లో పంచాయతీ లేఅవుట్ చేసి ఆ ప్రాంతంలో ఉన్న రోడ్డును కబ్జా చేసి గోడ కట్టారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని గత నెల 24న మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామని తెలిపారు. అలాగే రాళ్లగూడలో 2ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాపై సీఎం ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

గత రెండేళ్లతో పోలిస్తే ఈ సారి యాసంగి సాగు ఉమ్మడి జిల్లాలో గణనీయంగా మందగించింది. వానాకాలంలో కాస్త అటు ఇటుగా సాధారణ వర్షపాతం నమోదైనా కురిసిన వానలు సమ్మిళితంగా పడలేదు. మొత్తం సీజన్‌లో పడాల్సిన వర్షపాతం ఒక్క అక్టోబరు నెలలోనే 90శాతం నమోదవడంతో జల వనరుల్లో నీటి లభ్యత కొరవడి యాసంగి సాగుపై ప్రభావం పడింది. చాలా చెరువుల్లో ఇప్పటికే నీరు నిండుకోగా తగ్గుతున్న జలమట్టాలతో బోర్లు కూడా నీరు పోయని పరిస్థితి నెలకొంది. అలాగే గతేడాది చివరి రెండు నెలలు చినుకైనా కురవలేదు. యాసంగి సీజన్ ప్రారంభంలోనూ వర్షాల్లేవు. దీంతో ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో యాసంగి లక్ష్యంలో 26శాతమే పంటలు వేశారు. అలాగే మేడ్చల్‌లో 67.96శాతం, వికారాబాద్‌లో 56.2శాతం చొప్పున ఇప్పటి వరకు సాగు చేశారు.





బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్‌లో వరినాటు పనుల్లో రైతులు, మహిళలు

సాగని యాసంగి

రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 26శాతమే సాగు

- మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోనూ అంచనాలనందుకోని ఫసల్
- వర్షాభావ పరిస్థితులే కారణం
- చెరువు, కుంటల్లో కొరవడిన నీటి లభ్యత
- భారీగా పడిపోతున్న భూగర్భ జలమట్టాలు
- సాగు, తాగునీటికి మోగుతున్న ప్రమాద ఘంటికలు
- ఆందోళనలో అన్నదాతలు

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 6): ఈ ఏడాది యాసంగి సీజన్ రైతులకు ఆశాజనకంగా కనిపించడం లేదు. గత వానకాలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉమ్మడి జిల్లాలో యాసంగి పంటలు సాగు గణనీయంగా పడిపోయింది. యాసంగి సీజన్ దాదాపు ముగింపు దశకు వస్తున్నా ఇప్పటి వరకు సగం విస్తీర్ణంలో కూడా రైతులు పంటలు వేయలేదు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కడా ఆశాజనక పరిస్థితుల్లేవు. ముఖ్యంగా మిగతా రెండు జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలో పరిస్థితులు మరింత దయనీయంగా ఉన్నాయి. కనీస స్థాయిలో కూడా ఈ ఏడాది యాసంగి పంటలు వేయలేదు. రంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 26శాతమే పంటలు వేయగా, వికారాబాద్‌లో 67.96శాతం, మేడ్చల్‌లో 56శాతం చొప్పున సాగు చేశారు. ప్రధాన పంట వరి సాగు భారీగా పడిపోయింది. పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోవడంతో బోర్లు పోయక యాసంగి సాగుపై ప్రభావం పడింది. ఫిబ్రవరి మొదటి వారం గడుస్తున్నా సగం విస్తీర్ణంలో కూడా పంటలు సాగుచేయలేదు. సాధారణంగా యాసంగి సీజన్‌లో సాగు పెరగాలంటే అక్టోబరు నుంచి డిసెంబరు మొదటి వారం వరకు పడిన వర్షాలే ఆధారం. కానీ గత వానకాలంలో ఈ రెండు నెలలూ చినుకైనా పడలేదు. పడ్డ వర్షాలు కూడా అంతటా విస్తారంగా కురవలేదు. పడ్డచోట్ల కొన్ని వానలు భారీగా నమోదైనా చాలాచోట్ల నెలల తరబడి చినుకైనా రాలలేదు. తరి పంటలు అటుంచి మెట్ట పంటలైన మొక్కజొన్న, జొన్న, కంది వంటివి, కూరగాయ పంటలు సైతం సరిగా పండలేదు. అదీగాక వర్షాభావంతో భూగర్భ జలాలు శరవేగంగా పడిపోతున్నాయి. ఈ ప్రభావం యాసంగిపై తీవ్రంగా పడింది. రంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగిలో అన్ని రకాల పంటలు 66,076 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు కేవలం 18,939 ఎకరాల్లో మాత్రం పంటలు వేశారు. లక్ష్యంలో 28.6శాతం మాత్రమే పంటలు వేశారు. ముఖ్యంగా వరి సాగు నామమాత్రంగా ఉంది. యాసంగిలో 40వేల ఎకరాలకు పైగా వరి వేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 457ఎకరాల్లో మాత్రమే సాగైంది. సీజన్ ముగింపు దశకు వస్తున్నా అనేక చోట్ల నారుమళ్లు ఇంకా చేతికంద లేదు. ప్రధాన పంటలైన మొక్కజొన్న, శనగ, వేరుశెనగ సాగు సైతం అంతంతమాత్రమే ఉంది. సాగునీటి కొరతే వల్లే ఈ దుస్థితి నెలకొంది. అలాగే వికారాబాద్‌లో ఈ సీజన్‌లో 87,694 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 49,124 ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. ఇక మేడ్చల్ జిల్లాల్లో 10,132 ఎకరాల్లో యాసంగి పంటలు సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 6,886 ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు.

రంగారెడ్డి జిల్లాలో పంటల సాగు వివరాలు (ఎకరాల్లో..)

పంట	ఈ ఏడాది లక్ష్యం	ఇప్పటి వరకు సాగైంది
వరి	52,470	7,485
జొన్న	780	469
మొక్కజొన్న	6,205	1,178
తృణధాన్యాలు	7,037	1,667
శనగ	6,497	1,306
వేరు శనగ	4,509	5,987
కుసుమ	2,731	2,140

జిల్లాల్లో వర్షపాత వివరాలు (మిల్లీ మీటర్లలో)

	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం	పెరుగుదల/ తరుగుదల
రంగారెడ్డి	661.5	656	-1%
మేడ్చల్	734.8	793.1	8%
వికారాబాద్	731.5	824.7	13%

సీజన్‌లో కానరాని వర్షాలు

మూడు జిల్లాల్లో సాధారణ వర్షపాతమే నమోదైనప్పటికీ రబీలో కనీస స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతోనే రైతులకు ఇపుడు సమస్యలు తలెత్తాయి. రంగారెడ్డి జిల్లాలో సగటు వర్షపాతం 661.5 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 656 వర్షపాతం నమోదైంది. మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోనూ దాదాపు సగటు వర్షాలు కురిశాయి. అయితే ఇందులో సుమారు 90శాతం వర్షపాతం ఒక్క అక్టోబరు నెలలోనే కురవడం గమనార్హం. తరువాత ఎక్కడా పెద్దగా వర్షాలు పడలేదు. రబీలో పంటల సాగుకు కీలకమైన నవంబరు, డిసెంబరు నెలల్లో నామమాత్ర వర్షాలు తప్ప ఎక్కడా చెరువు కుంటుల్లోకి నీరొచ్చేలా, భూగర్భ జలమట్టాలు పెరిగేలా వానలు పడలేదు.

జిల్లాల వారీగా యాసంగి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)

జిల్లా	సాధారణ సాగు	ఇప్పటి వరకు సాగు	శాతం
రంగారెడ్డి	74,050	19,204	25.93
మేడ్చల్	10,132	6,886	67.96
వికారాబాద్	87,694	49,124	56.02

భారీగా పడిపోతున్న భూగర్భ జలమట్టాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. గత రెండు నెలలుగా భూగర్భ జలమట్టాలు శరవేగంగా పడిపోతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వేసవికి ముందే నీటి మట్టాలు అడుగంటడంతో యాసంగి పంటలపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులు సైతం కన్పిస్తున్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ ఈ యాసంగి సీజన్ ఆరంభం నుంచి ఒక్కవానా కురవలేదు. దీంతో భారీగా నీటి వాడకంతో జలమట్టాలు పడిపోతున్నాయి. అనేక మండలాల్లో అక్టోబరు, నవంబరు నెలల్లో కనిష్ట స్థాయిల్లోనైనా వర్షాలు పడలేదు. ఈ వేసవిలో నీటిఎద్దడి తలెత్తే ఆస్కారం లేకపోలేదు. పట్టణ ప్రాంతాలు, గ్రామీణ మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పంటలకు, ఇతర అవసరాలకు నీటి వాడకం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు భారీగా తరిగిపోతున్నాయి.

మూడు జిల్లాల్లోనూ సీజన్ అంతంతే!

యాసంగి సీజన్ మొదలైన తరువాత వర్షాలు పడక పంటలు సాగుపై తీవ్ర ప్రభావం పడింది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో యాసంగి సాగు అంతంత మాత్రంగా ఉంది. యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 26శాతమే పంటలేశారు. మేడ్చల్‌లో 67.96 శాతం, వికారాబాద్‌లో 56.2శాతం వరకు పంటలు వేశారు. నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు కురవకే యాసంగి సాగు సంక్షోభంలో పడింది. యాసంగి సీజన్‌లో ప్రధాన పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. రంగారెడ్డిలో యాసంగి 52,470ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 1,369 ఎకరాల్లో మాత్రమే వేశారు. అయితే ఇంకా అనేక చోట్ల నారుమళ్లు సిద్ధంగా ఉన్నాయి. వికారాబాద్‌లో 45,620 ఎకరాల్లో వరి వేయాల్సి ఉండగా 3,763 ఎకరాల్లో నాట్లు వేశారు. అలాగే మేడ్చల్ జిల్లాలో 9,745 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,475 ఎకరాల్లో నాట్లు వేశారు. వానకాలంలో ఆశించినంత వర్షాలు కురువక భూగర్భ జలాల లభ్యతపై రైతుల్లో ఆందోళన నెలకొంది. వేసిన పంటలకు మరో రెండు నెలలు నీటి తడి అందించాల్సి ఉంది. ఇందుకు సరిపడా వనరుల్లో నీటి లభ్యత ఉంటుందా.. పంటలు చేతికందుతాయా? లేక ఎండుతాయా? అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణ మిర్చి ఎగుమతికి డిమాండ్

- అమెరికన్, కేరళ వ్యవసాయ శాస్త్రవేత్తల వెల్లడి
- క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

మాడ్గుల, ఫిబ్రవరి 6: తెలంగాణలో పండించే సన్న మిర్చి ఎగుమతికి మంచి డిమాండ్ ఉందని అమెరికా, కేరళకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. ఓ ప్రైవేట్ విత్తన కంపెనీ ఆధ్వర్యంలో మాడ్గుల మండలంలోని ఇర్విన్, రామ్‌దుగ్యాల, శాంతిగూడెంలలో రైతులు సాగుచేస్తున్న మిర్చి పంటను మంగళవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. తెలంగాణ భూముల్లో నాణ్యమైన మిర్చి పంట పండిస్తున్నారని విదేశీ, స్వదేశీ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులను అభినందించారు. మాడ్గుల మండలం అవురుపల్లి సమీపంలో మిర్చి ఉత్పత్తుల కోసం ఓ కంపెనీని స్థాపిస్తామని తెలిపారు. రైతులు పండించిన మిర్చి పంటను ఆ కంపెనీయే కొనుగోలు చేస్తుందని, మిర్చి పౌడర్‌ను ఇతర రాష్ట్రలకు, దేశాలకు ఎగుమతి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న అమెరికా, కేరళ శాస్త్రవేత్తలు

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 6 : పీఎం విశ్వకర్మ పథకాన్ని వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీఎం విశ్వకర్మ స్కీమ్‌పై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ స్కీమ్ కింద చేతి వృత్తుల వారికి శిక్షణ ఇచ్చి రుణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణ ద్వారా కళా నైపుణ్యాలకు వన్నె దిద్దడమేగాక వృత్తిదారులకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నారు. గ్రామీణంలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఈ పథకానికి 18రకాల కుల వృత్తుల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వడ్రంగి, కమ్మరి, కంసాలి, మోచీ, తాళాల మరమ్మతులు చేసేవారు, బీటకమ్మరి, అవుసలి, కుమ్మరి, మేదరి, ఉప్పరి, ఎరుకలి, శిల్పులు, బొమ్మలు చేసే వారు, చాకలి, మంగలి, పూలల్లే వారు, దర్జీ, నేతలు, బెస్తలు తదితర కుల వృత్తుల వారు ఈ పథకానికి అర్హులని వివరించారు. శిక్షణ ఇచ్చి గుర్తింపు కార్డు, ధ్రువీకరణ పత్రం, రూ.15వేల విలువ గల టూల్ కిట్ ఇస్తారని తెలిపారు. అలాగే వృత్తిపని కొనసాగించేందుకు వడ్డీ లేని రుణం ఇస్తారన్నారు. అభ్యర్థులు కనీస వయసు 18 సంవత్సరాల నుంచి గరిష్ఠంగా 60 ఏళ్లలోపు ఉండాలన్నారు. గడిచిన ఐదేళ్లలో కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల రుణ సాయం పొందని వారే అర్హులన్నారు. కుటుంబంలో ఒక్కరికే పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సర్వీసులో ఉన్న వ్యక్తికి పథకం వర్తించదన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, పరిశ్రమల అధికారి రాజేశ్వర్ రెడ్డి, వ్యవసాయ అధికారి గీతారెడ్డి, డీసీబీ అధికారి ధాత్రిదేవి, ఇన్‌చార్జి డీపీవో సంధ్యారాణి, మెప్మా పీడీ శంకర్ సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రేపటి నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

ఈ నెల 7వ తేదీ నుంచి 14 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఉదయం 8గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులకు వారి గ్రామాల సమస్యలు తెలుసుకోవాలన్నారు. సానిటేషన్ డ్రైవ్‌లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, అదనపు కలెక్టర్లు, మండల అధికారులు రోజూ ఒక గ్రామంలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 15న పంచాయతీల్లో గ్రామసభ నిర్వహించి పంచాయతీ పారిశుధ్య, ఇతర సిబ్బందిని సన్మానించాలని సూచించారు. స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ కార్యక్రమానికి ఏ అధికారి, సిబ్బంది గైర్హాజరు కాకూడదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రతిమాసింగ్, ఇన్‌చార్జి డీపీవో సంధ్యారాణి, సీఈవో దిలీప్‌కుమార్, మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, పీఆర్ ఎస్ఈ రాజేశ్వర్, డీఆర్డీఏ అదనపు పీడీ నీరజ, ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో ప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషించాలి

ప్రత్యేకాధికారులు గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ శశాంక తెలిపారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రత్యేక అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున ఈ నెల 2 నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధిలో అధికారులు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. వారు 2018పంచాయతీ రాజ్ యాక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీల బ్యాంక్ అకౌంట్ల గురించి, గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, కోర్టు కేసులపైన అవగాహన పెంచుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ ఇంటికి నల్లా నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు వంద శాతం పని దినాలను కల్పించాలన్నారు.



'గావ్ చలో' కార్యక్రమంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

మూడోసారి బీజేపీదే అధికారం

మహేశ్వరం, ఫిబ్రవరి 6: అవినీతి రహితంగా, జన రంజకంగా పాలన సాగిస్తున్న బీజేపీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయంకా మోగించి మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆ పార్టీ నిర్వహిస్తున్న 'గావ్ చలో' అభియాన్‌ను మంగళవారం మండలంలోని అమీర్‌పేటలో ప్రారంభించారు. అనంతరం బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం, మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగం నరేంద్ర మోదీ వైపే ఉన్నారని, రాహుల్‌గాంధీ ప్రధాని రేసులో లేరన్నారు. తెలంగాణాలో ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ గారడీ చేస్తోందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ లీడర్లు పదవుల కోసం డబ్బుల సూట్‌కేసులను ఢిల్లీకి పంపుతున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కోట్లు పంచినా మోదీ గెలుపును అడ్డుకోలేరని.. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినప్పుడే ఆ పార్టీ పనైపోయిందని, ఆ పార్టీ అవసరం తెలంగాణకు లేదన్నారు. ముస్లిం మహిళల హక్కులను కాపాడి వారికి రక్షణ కల్పించిన మోదీకి 10కోట్ల ముస్లిం మహిళలు అండగా ఉన్నారన్నారు. హైదరాబాద్‌లో మజ్లిస్ నేత, ఎంపీ సలావుద్దీన్ ఓవైసీని ఎన్నికల్లో గట్టిగా ఢీకొంటామన్నారు. మోదీ కోసం బూత్ స్థాయి కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కమ్యూనిజం కనుమరుగైందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు అందెల శ్రీరాములుయాదవ్, టి.వీరేందర్‌గౌడ్,పాపయ్యగౌడ్, అనంతయ్యగౌడ్, కె.జంగయ్య, సుదర్శన్‌రెడ్డి, యాదీష్, యాదయ్యగౌడ్, నందీశ్వర్, పి.సుదర్శన్ పాల్గొన్నారు.

నష్టాల్లో క్యారెట్ రైతులు

- హోల్‌సేల్ కిలో ధర రూ.15
- మార్కెట్‌కు తరలిస్తే కూలీల ఖర్చు, రవాణా చార్జీలైనా రాని వైనం
- ఏటా అప్పులపాలవుతున్న కర్షకులు
- రేట్లు రెట్టింపయితేనే గిట్టుబాటు అంటున్న అన్నదాతలు



క్యారెట్ పంట చేను

చేవెళ్ల, ఫిబ్రవరి 6: ఆరుగాలం కష్టించి పండించిన క్యారెట్ పంటకు మార్కెట్‌లో ధర లేక రైతులు బోరుమంటున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలతో తమకు పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్యారెట్ మడుము(10 కిలోలు)కు రూ.150 నుంచి రూ.160 ఉంది. చిల్లర వ్యాపారులు కిలో రూ.45 నుంచి 50కి అమ్ముతున్నారు. కష్టపడి పండించి మార్కెట్ తరలిస్తే లాభాలు అటుంచి పెట్టుబడైనా వొస్తలేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న చేవెళ్ల డివిజన్‌లో మార్కెటింగ్ అవకాశాలు ఎక్కువగా ఉన్నందున రైతులు క్యారెట్ సాగుచేస్తున్నారు. వానకాలం, యాసంగి రెండు కాలాల్లోనూ చేవెళ్ల మండలంలో అత్యధికంగా క్యారెట్ పండిస్తున్నారు. గతేడాది ధరలు ఆశించినంత లేక రైతులు నష్టపోయారు. ఈ ఏడాది సైతం చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో 1,728ఎకరల్లో క్యారెట్ సాగు చేసినట్టు హార్టీకల్చర్ అధికారులు పేర్కొన్నారు. చేవెళ్ల మండలం చేవెళ్ల, చనువల్లి, గుండాల, లక్ష్మీగూడ, కందవాడ, అల్లావాడ, పామెన, కమ్మెట, ఇబ్రహీంపల్లి, దేవునిఎర్రవల్లి, ఆలూర్, రేగడి ఘనాపూర్, ఖానాపూర్, పలుగుట్ట, దేవరంపల్లి గ్రామాల్లో క్యారెట్ ఎక్కువగా వేశారు. ఇప్పుడు పొలాల నుంచి పంట తీసి మార్కెట్లకు తరలిస్తున్నారు. సాగు, కూలీల ఖర్చులు, ఖాళీ బస్తాలు, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు గతం కంటే ఎక్కువయ్యాయని, కానీ రేట్లు మాత్రం గతం కంటే హీనంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పంటను నగరంలోని మోండా మార్కెట్, సబ్జీమండి, గుడిమల్కాపూర్ తదితర హోల్‌సేల్ మార్కెట్లకు తరలిస్తే కూలీలు, దారి ఖర్చుల మందమే వస్తున్నాయని.. ఇక పెట్టుబడి ఊసే లేకుండా పోయిందని, తమ కుటుంబ రెక్కల కష్టం బూడిదలో పోసినట్టు అవుతోందని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత ధరలకు డబుల్ రేట్లు ఉంటేనే ఎంతోకొంత గిట్టుబాటు అవుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.



పొలంలో క్యారెట్ ఏరుతున్న రైతులు

రైతులకు సాగు ఖర్చులు పెరిగాయి



ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరలు డబుల్ ఉంటేనే రైతులకు కొంత వరకు పెట్టుబడులు చేతికొస్తాయి. నేను 3 ఎకరాల్లో క్యారెట్ సాగు చేశాను. ఈ సీజన్‌లో క్యారెట్ పంట తవ్వకానికి వచ్చింది. క్యారెట్ సాగుకు రూ.వేలలో పెట్టుబడి అవుతోంది. ఎప్పుడో ఒక్కసారి ధరలు ఉంటే సరిపోదు. ప్రసుత్తం కూలీల ఖర్చు, రవాణా భారం పెరిగాయి. క్యారెట్‌కు మంచి ధర ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ధరలేని సమయాల్లో ప్రభుత్వమే కొని ఉప ఉత్పత్తులైనా తయారు చేయాలి. లేదా మార్కెటింగ్ అవకాశాలను పెంచాలి. లేదంటే క్యారెట్ పంటకు రైతులు దూరం అవుతారు.

- కుమ్మరి వెంకటేశ్, రైతు, చనువల్లి

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పూడూరు, ఫిబ్రవరి 6: సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండల రైతు వేదికలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, ఇఫ్‌కో ఆధ్వర్యంలో మంగళవారం కిసాన్‌మేళ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశోధన సంస్థలు ఐసీఏఆర్, సీఆర్ఐడీఏ, ఏసీఏఆర్-2ఎంఆర్, ఐసీఏఆర్-2, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖ, వెంటర్నరీ శాఖ, ఐఎఫ్ఎఫ్‌సీవో, రాశీ తదితర సంస్థల పరిశోధన అంశాలను, ఉత్పత్తుల స్టాల్స్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ జి.నిర్మల, డాక్టర్ బి.నర్సింహులు, డాక్టర్ సంజీవరెడ్డి, డాక్టర్ రోహిత్, డాక్టర్ అన్విద్ధ, ఏడీవో గోపాల్, ఏవో తులసిరాం, ఏఈవో రాంబాబు పాల్గొన్నారు. కాగా,కిసాన్ మేళలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రైతులతో మాట్లాడుతుండగా దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు నేవీ రాడర్ ఇక్కడ ఏర్పాటు చేయరాదని కోరుతూ మెమోరాండం అందజేసేందుకు వెళ్లారు.ఈ సమయంలో కొందరు కాంగ్రెస్ నాయకులు సమావేశం నుంచి వచ్చి మీరు వచ్చి ఇక్కడ నేవీ రాడర్‌పై అడగటం ఏమిటని, దామగుండం కమిటీ సభ్యులపై మాటల యుద్ధానికి దిగారు. కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఎస్ఐ గిరి, సిబ్బంది వారిని అక్కడి నుంచి బయటికి పంపించారు.

పన్నుల సొమ్ము అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో వెలుగు చూసిన పన్నుల సొమ్ము స్వాహాపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్‌కు చెందిన దాసరి బాల్‌నర్సింహ 19 జూలై 2023 ఇంటి పన్ను కోసం మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ అయిన అనితకు రూ.48,500 ఇచ్చినట్లు ఫిర్యాదులో వివరించారు. కానీ నేటికీ అట్టి డబ్బులకు రసీదు ఇవ్వడంలేదని వివరించారు. తరచూ తాను డబ్బుల గురించి కంప్యూటర్ ఆపరేటర్‌ను అడిగితే అట్టి డబ్బులు కౌన్సిలర్ ఆంజనేయులు వద్ద ఉన్నాయని సమాధానమిస్తున్నారని తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో తాను చెల్లించిన సొమ్ముకు రసీదు ఇవ్వకుండా నెలల తరబడి ఇబ్బందుకు గురిచేస్తున్నారని వాపోయారు. అనితపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దాసరి బాల్‌నర్సింహ, కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, నాయకులు ముత్యాలు యాదవ్, బర్ల రాదాకృష్ణ, కోరుబోతు నాగరాజు, సాయిచరణ్‌రెడ్డి తదితరులున్నారు.



చిరంజీవికి శుభాకాంక్షలు తెలుపుతున్న వీరేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

చిరంజీవికి 'పద్మవిభూషణ్' అభినందనీయం

మహేశ్వరం, ఫిబ్రవరి 6 : కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ సినీహీరో మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు దక్కడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. ఈమేరకు సోమవారం నగరంలోని చిరంజీవి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ ఎంతో ఉన్నత విలువలు గల చిరంజీవికి పద్మవిభూషణ్ దక్కడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా వారి తండ్రి దేవేందర్‌గౌడ్‌కు చిరంజీవికి మధ్య ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేశారు. చిరంజీవిని కలిసిన వారిలో దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు విజయేందర్‌గౌడ్, శ్వేత, దివ్యశ్రీలు ఉన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదు

- బీఆర్ఎస్ చెప్పింది కొండంత.. చేసింది గోరంత
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే చాలు తప్పక నిలబెట్టుకుంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరుగ్యారంటీల హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. వచ్చేనెల (మార్చి) నుంచి ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అమలు చేస్తున్నట్లు అమలు చేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మవద్దని చెప్పారు. ఆపార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందన్నారు. ఆపార్టీ చెప్పింది కొండంత, చేసింది మాత్రం గోరంతేనని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఏం చేయలేకపోయిందని, ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ చేస్తే సహించలేకపోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనురాధ, జడ్పీటీసీ ధారాసింగ్, తహసీల్దారు కిషన్‌నాయక్, వైస్ ఎంపీపీ మధులత, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్ముమాణెమ్మ, కోఆప్షన్ సభ్యులు నసీర్, ఎంపీటీసీలు లొంకనీలు, శంకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, పార్టీ మండల అధ్యక్షులు గోపాల్, మైనార్టీ నాయకులు రియాజ్, రుద్రారం మహిపాల్‌రెడ్డి, సాయిని నారాయణరెడ్డి, డీవై.నర్సింహులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు రూ.13కోట్ల నిధులు మంజూరు

తాండూరు: తాండూరు నియోజకవర్గ పరిధిలో గల తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ ఒక్కొక్క మండలానికి రూ.3కోట్ల చొప్పున కోట్‌పల్లి మండలానికి రూ.కోటి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఓప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో తక్షణమే చేపట్టాల్సిన పనులను గుర్తించి నూతనంగా నియమితులైన ప్రత్యేక అధికారుల ద్వారా పనులకు సంబంధించిన తీర్మానం తీసుకొని వెంటనే గ్రామాల్లో పనులు ప్రారంభించాలన్నారు. అదేవిధంగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు గ్రామాలకు వెళ్లి పనుల త్వరగా పూర్తి చేసేవిధంగా చూడాలని కోరారు.

భద్రేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

తాండూరు పట్టణంలో గల శ్రీ భావిగి భద్రేశ్వర స్వామిని మంగళవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య ఎమ్మెల్యేను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వీరశైవ సమాజం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.




నెక్ జోనల్ కమిటీ ఎన్నికల్లో సభ్యుల వాదోపవాదాలు

నెక్ జోనల్ కమిటీ ఎన్నిక రద్దు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 6: షాద్‌నగర్‌లో నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ఎన్నికల్లో గందరగోళం, ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో మంగళవారం ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు. షాద్‌నగర్‌లోని బీవీరావు నగర్‌లో అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల జాబితాలో పేర్లు ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలని ఓ వర్గం పట్టు బట్టింది. కానీ లీజుదారులకు ఓటు వేసే హక్కు లేదని మరో వర్గం వాదించింది. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాలు వాదించుకోవడంతో ఎన్నికల అధికారి నారాయణ రావు ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఆశాజనకంగా కందుల ధరలు



ధారూరు, ఫిబ్రవరి 6: ఈసారి కంది పంట సాగు విస్తీర్ణం తక్కువగా ఉన్నా మార్కెట్‌లో కందుల ధరలతో పాటు పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు వారాలుగా ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో కందుల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. గతేడాది కన్నా ఈసారి కందుల ధరలు పెరగటంతో కంది రైతులు లాభాల బాటలో ఉన్నారు. మార్కెట్‌లో కందులు ధరలు ప్రస్తుతం క్వింటాలుకు రూ.10వేల నుంచి రూ.10,400ల వరకు పలుకుతున్నాయి. కందుల ధరలు ఆశించిన విధంగా ఉండటంతో రైతులు కందులను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కందుల ధరలు పెరిగే అవకాశమున్నందన్న అంచనాతో కొందరు రైతులు కందులను విక్రయించకుండా నిల్వ ఉంచుకున్నారు. కందుల ధరలు క్వింటాలుకు రూ. 12వేల వరకు పెరగవచ్చనే ఆశతో కొంతమంది రైతులు ఎదురుచూస్తున్నారు. పత్తి ధరల కన్నా కంది పంట ధరలు బాగా ఉన్నాయని పత్తిసాగు చేసి పంట దిగుబడి, ధరరాక నష్టపోయామని పత్తిరైతులు వాపోతున్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైనది

రంగారెడ్డి అర్బన్, ఆదిభట్ల, ఫిబ్రవరి 6 : ప్రజాసామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని, దానిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ గణేష్ అన్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీనివాస మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులను కలెక్టరేట్‌లో ఫీల్డ్ విజిట్‌కు తీసుకెళ్లారు. ఈవీఎం మిషన్ల పనితీరు, వినియోగం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

44వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 6: ఖరీఫ్ సీజన్ 2023-24లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 44వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం రైస్ మిల్లర్లతో సీఎంఆర్ ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి వెంటనే డెలివరీ చేసే అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన వరిధాన్యాన్ని జిల్లాలోని 27 రైస్‌మిల్లర్లకు సీఎంఆర్ కోసం అందజేసినట్లు తెలిపారు. ఈ ధాన్యాన్ని వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని మిల్లర్లను ఆదేశించారు. రైస్ మిల్లర్లు తమ మిల్లింగ్ సామర్థ్యం ప్రకారం ప్రతీరోజు సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాలని సూచించారు. ఇట్టి ధాన్యాన్ని ఎవరైనా రైస్ మిల్లర్లు రీసైక్లింగ్‌కు పాల్పడితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరు మిల్లర్లు 2023-24 సంవత్సరానికి సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను వెంటనే డెలివరీ చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు రోజూ మిల్లుల్లో ధాన్యాన్ని తనిఖీ చేసి వెంటనే ఎఫ్‌సీఐకి విడుదల చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పూర్వసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కొండల్‌రావు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 6: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మోమిన్‌పేట్, బంటారం, కోట్‌పల్లి మండలాల ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్స్ హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. వచ్చే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలతో విద్యాబోధన చేయాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు, ఎంఈవో గోపాల్, విద్యాసాగర్, చంద్రప్ప, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



అన్నోజిగూడ వద్ద పైప్‌లైన్ పగిలి సీసీ రోడ్డును పెకిలించుకొని ఉబికివస్తున్న కృష్ణానీరు

కృష్ణ కృష్ణా..!

- పైప్‌లైన్ పగిలి వృథా అవుతున్న తాగునీరు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6: వందల కిలోమీటర్ల దూరం నుంచి ప్రజల దాహార్తిని తీర్చేందుకు తీసుకువచ్చిన కృష్ణా తాగునీరు అధికారుల పర్యవేక్షణ లోపంతో వృథా అవుతోంది. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన కృష్ణానీటి పైప్‌లైన్ పగిలిపోయి చాలాసేపు తాగునీరు వృథాగా పోయింది. దాదాపు కిలోమీటర్ పొడవున నీరు పారుతుండడంతో ఎర్రటి ఎండలో మిట్టమధ్యాహ్నం రోడ్డుపై వరదలేంటని పలువురు ఆశ్చర్యపోయారు. అధికారులకు సమాచారం అందించడంతో నీటి సరఫరాను నిలిపివేశారు.



ఇబ్రహీంపట్నం: మెడల్స్ సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 'పట్నం' విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఇబ్రహీంపట్నంకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. ఈనెల 3, 4వ తేదీల్లో కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో బ్రైట్‌స్టార్ కరాటే అసోసియేషన్, విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. బొంగులూరు నలంద గ్రామర్ స్కూల్‌కు చెందిన అక్షిత, జ్యోత్స్న, శ్రీనిత్ కుమార్, ఇబ్రహీంపట్నం ఆంగ్లిస్టు హైస్కూల్‌కు చెందిన సాత్విక్, ప్రియాంక హైస్కూల్‌కు చెందిన గీతేశ్వర్, శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన శ్రీహర్షరెడ్డిలు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ యు.శ్రీనివాస్ తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యానికి ఎంతో మేలు

మొయినాబాద్ రూరల్ : క్రీడలతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ బండరి మంజుల అన్నారు. మండల పరిధిలోని మొయిబాద్‌లోని మాస్టర్ మైండ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థిని టి.మధు నగరంలో నిర్వహించిన ఇంటర్‌నేషనల్ కరాటే చాంపియన్‌షిప్(ఆల్‌స్టైల్) పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందంతో కలిసి సన్మానించి అభినందించారు. అనంతరం మధు తల్లిదండ్రులను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్లు రవియాదవ్, రమేష్‌యాదవ్, ధరణికుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో కొత్తపేట విద్యార్థినుల ప్రతిభ

కేశంపేట : హైదరాబాద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో భాగంగా సబ్ జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో కేశంపేట మండలం కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో 7వ తరగతి విద్యార్థినులు స్పందన రెండో బహుమతి, సుప్రియ మూడవ బహుమతి సాధించారు. విద్యార్థినీలతో పాటు పీఈటీ శిరీషలను హెచ్‌ఎం చంద్రశేఖర్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు శ్రీనివాససాగర్ అభినందించారు.



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న విజితారెడ్డి

కేసీఆర్‌ను కలిసిన జడ్పీటీసీ విజితారెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 6: మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, వెల్దండ జడ్పీటీసీ డాక్టర్ ద్యాప విజితారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ భవన్‌లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి కేసీఆర్‌ను కలిసి ఈనెల 21న జరిగే తన కుమారుడి వివాహానికి హాజరుకావాలని పెళ్లి పత్రికను అందజేశారు.

హరీశ్‌రావును కలిసిన బన్సీలాల్



ఆమనగల్లు, ఫిబ్రవరి 6: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావును మంగళవారం తెలంగాణ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ, బయోడీజిల్ అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మల్కేడి బన్సీలాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు తన కూతురు స్నేహతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పర్యావరణ పరిరక్షణకు సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను హరీశ్‌రావుకు వివరించినట్లు ఆయన తెలిపారు.

మీరాపూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో చెన్నాబాయి, తదితరులు

షాబాద్, ఫిబ్రవరి 6 : మండల పరిధిలోని మీరాపూర్ దర్గాలో ఖాజా గరీబ్ నవాజ్ ప్రత్యేక ప్రార్థనలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకులు చెన్నాబాయి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నగరానికి చెందిన యువకులు కవ్వాలి నిర్వహించారు. కాగా, ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేందుకు జిల్లాతో పాటు పక్కజిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



కృష్ణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 6 : జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘణాపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణ రేపటి వేకువ మాదే అనే పుస్తకాన్ని రచించినందుకు తోటి ఉపాధ్యాయులు మంగళవారం పెద్ద ఎల్కిచర్ల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కృష్ణను సన్మానించారు. ఉపాధ్యాయులు శేఖర్‌గౌడ్, తిరుమలయ్య, వెంకట్‌రావు, శ్యామాచారి, శోభన్, రాగ్య, కవిత, శ్రీదేవి, లలితాదేవి, జ్యోతికుమారి, దశమణి, రాజ్‌కుమార్, వాజిద్, శివాజి, తదితరులు పాల్గొన్నారు.

'చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

ఆమనగల్లు, ఫిబ్రవరి 6: చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించి వెంటనే అమలు చేయాలని యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ కోరారు. కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో బీసీల వాటా తేల్చాలని కోరారు. బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన మహాధర్నాలో కడ్తాల మండల కేంద్రానికి చెందిన రాఘవేందర్ ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి, ఎంపీ మస్తాన్‌రావు, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లీల వెంకటేశ్, జాతీయ బీసీ రక్షదళ్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మహిళా నాయకురాలు రజిత, వాణి, అరవింద్, స్వామి, లింగంయాదవ్, రాజేందర్‌లతో కలిసి ధర్నాలో పాల్గొన్నట్లు తెలిపారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం

యాచారం, ఫిబ్రవరి 6 : మండలంలోని నందివనపర్తిలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 47 మందికి ఆపరేషన్లు చేసేందుకు నిర్వాహకులు రెఫర్ చేశారు. మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్ నగరంలోని పలువురు కంటి వైద్యులతో శిబిరం ఏర్పాటు చేయించారు. ప్రతీయేటా రెండు సార్లు గ్రామంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి



సమ్మేళనంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 6 : ఆశా కార్యకర్తల, రెండో ఏఎన్ఎమ్‌ల దీర్ఘకాలిక సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో మంగళవారం జిల్లా వైద్యారోగ్య ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ఉద్యోగాలు క్రమబద్ధీకరించి రూ.26వేలు వేతనం, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించాలని, రూ.10 వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చూస్తానని కసిరెడ్డి హామీ ఇచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి 10 లక్షల కు పెంచి అమలు చేస్తుందని ఆయన వివరించారు. బీఆర్ఎస్ పాలనలో వైద్యరంగంలో కల్వకుర్తి నియోజకవర్గం తీవ్ర వెనుకబాటుకు గురైందని ఆరోపించారు. జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించకుండా ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఈసీ, ఆర్‌సీహెచ్, హెచ్ఆర్‌డీ, ఏఎన్ఎంలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, పరీక్షిత్, ఎంపీపీ అనితావిజయ్, ఆశాకార్యకర్తల సంఘం నాయకురాళ్లు సరోజ, సల్మా, వెంకటమ్మ, సుజాత, సరోజిని, జ్యోతి, సిబ్బంది, నాయకులు దశరథం, కృష్ణనాయక్, జగన్, రవీందర్‌రెడ్డి, సురేశ్‌నాయక్, ప్రసాద్, బాబా, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అలీం, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఆహారంతో ఆరోగ్యంపై ప్రభావం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ కాంచనలత, ఉపాధ్యాయులు

చేవెళ్ల, ఫిబ్రవరి 6 : ఆహార కల్తీతో ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో ఆహార కల్తీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆహార కల్తీని ఎలా గుర్తించాలో ప్రయోగపూర్వకంగా చేసి చూపించారు. ప్రతిఒక్కరూ ఆహార నాణ్యతను గుర్తించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. లేబుల్ ఉన్న ఆహార ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ



జితేందర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధికి యత్నిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. బీసీని అని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా కులగణన ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం జితేందర్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, సేవాదల్ జిల్లా నాయకుడు కానుగుల దశరథం, కాంగ్రెస్ జిల్లా నాయకులు మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు జితేందర్‌ను సన్మానించి అభినందించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యంపై దాడి జరిగి నియంతృత్వం రాజ్యమేలుతుందని అన్నారు. రాహుల్ చేపట్టిన భారత్ జోడోన్యాయ్ యాత్రకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేని బీజేపీ కుట్ర రాజకీయాలు సాగిస్తుందని జితేందర్‌మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు కాక తప్పదన్నారు. అధికారం కోల్పోయామన్న అక్కసుతో ఆ పార్టీ నాయకులు సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు జగన్, వస్పుల మానయ్య, రాఘవేందర్, కృష్ణనాయక్, రచ్చ శ్రీరాములు, రాజశేఖర్, మల్లేశ్‌నాయక్, కుమార్‌గౌడ్, మహేశ్, రవీందర్ నాయక్, కాలె మల్లయ్య, పూసల సత్యం, జంతుక యాదయ్య, తదితరులున్నారు.

గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతు ఇవ్వాలి



కందుకూరు : మండల వైద్యాధికారి రాధికకు సమ్మె నోటీసు ఇస్తున్న బాల్‌రాజ్, ఆశాలు

కందుకూరు/యాచారం, ఫిబ్రవరి 6 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంధుకు ప్రతీఒక్కరు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిధిలోని గ్రామాల్లో పనిచేస్తున్న ఆశావర్కర్లతో కలిసి మండల వైద్యాధికారి డాక్టర్ రాధికకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు జయసుధ, శ్రీలత, అనిత, చంద్రకళ, ముంతాజ్‌బేగం, సునీత, అశ్విని, జయమ్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు. అలాగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం యాచారం మండల నాయకుడు చందూనాయక్ కోరారు. మండల ఇన్‌చార్జి వైద్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మికి సీఐటీయూ నాయకులు చందూనాయక్ వినతిపత్రం అందించారు. ఆశావర్కర్లు ఉన్నారు.

బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి



మాడ్గుల : బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



షాద్‌నగర్ రూరల్ : మాట్లాడుతున్న నాయకులు

కడ్తాల్/ఆమనగల్లు, ఫిబ్రవరి 6 : సీఎం రేవంత్ రెడ్డిపై చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు అశోక్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి కడ్తాల సీఐ శివప్రసాద్‌కు సుమన్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు సిద్దిగారి సురేశ్, వల్లభదాసు నర్సింహ, రవి, జంగయ్య, సిరయ్య, పత్యనాయక్, దేవ్‌సింగ్ తదితరులున్నారు. రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ కోరారు. కేసీఆర్ బంట్రోతు అయిన సుమన్‌కు రేవంత్‌ను విమర్శించే అర్హతలేదన్నారు. ఆమనగల్లు మండల కాంగ్రెస్ నాయకులు సుమన్‌పై ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కృష్ణనాయక్, ప్రసాద్, విజయ్, అలీం, సురేశ్ నాయక్, నాజర్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల : సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సుమన్ నోరు అదుపులో పెట్టుకో..

షాద్‌నగర్ రూరల్ : బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని, సీఎం రేవంత్‌రెడ్డిని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సాగునీటి పేరుతో జీవో ఇచ్చింది అప్పటి సీఎం కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణకు బూతు మాటలు నేర్పిన చరిత్ర కూడా కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణా రాష్ట్రాన్ని కేసీఆర్ ఒక్కడే తెచ్చినట్లు బాల్క సుమన్ దొరల గడీకి చెప్పులు మోస్తున్నాడని విమర్శించారు. దొరల గడికి ఊడిగం చేసే సుమన్ వాళ్ల ఎంగిలి మెతుకులకు ఆశపడి సీఎం పట్ల ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తగిన బుద్ధి చెప్పుతామని తెలిపారు. సమావేశంలో నాయకులు రఘు, బాబర్ ఖాన్, చెంది తిరుపతి రెడ్డి, రాజు నాయక్, సతీష్, హరినాథ్‌రెడ్డి, ప్రవీణ్, నరేష్ తదితరులు ఉన్నారు.

బాల్క సుమన్‌కు మతి భ్రమించింది

కొత్తూర్ : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌కు మతిభ్రమించిందని, బయట కనిపిస్తే చెప్పులతో సమాధానం చెబుతామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్క సుమన్ ఎమ్మెల్యే పదవీ పోయిన తర్వాత నుంచి మతిభ్రమించి మాట్లాడుతూ పిచ్చికూతలు కూస్తున్నారని దుయ్యబట్టారు. హద్దులు దాటిన సుమన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రోళ్ల జగన్, శివ, అంజినాయక్, అనిల్, రాంజానాయక్, జనార్ధన్, జంగయ్య, రాములు, బాలునాయక్, రమేష్, రవీందర్, బాలరాజు, ప్రవీణ్, అశోక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే క్షమాపణ చెప్పాలి

మాడ్గుల : సీఎం రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన బాల్క సుమన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పెంపుడు కుక్కకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత లేదని వెంకటేశ్వర్లుగౌడ్ హెచ్చరించారు. మాడ్గుల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సుమన్ దిష్టిబొమ్మను నాయకులతో కలిసి దహనం చేశారు. ఉపసర్పంచ్ రాములు, జింకల భాస్కర్, అన్నేపాక కిరణ్, బామండ్లపల్లి నర్సింహ, మహేశ్, లాలయ్య, శేఖర్, రామచంద్రయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూర్ : మాట్లాడుతున్న కర్రోళ్ల సురేందర్

క్రైం కార్నర్

ఉరేసుకొని జూనియర్ లైన్‌మన్ ఆత్మహత్య

● ఆన్‌లైన్ బెట్టింగులు.. అప్పులే కారణం : పోలీసులు



శివారెడ్డి(ఫైల్)

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6: ఆన్‌లైన్ బెట్టింగులు, అప్పుల బాధతో జూనియర్ లైన్ మెన్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి రాయపోల్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన గుండ్లపల్లి నర్సింహారెడ్డి, సావిత్రిల కుమారుడు శివారెడ్డి(28) యాచారం మండలం మేడిపల్లిలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే, అతడు ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడి అప్పుల పాలైనట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

వివాహిత అదృశ్యం



శారద

కొత్తూర్, ఫిబ్రవరి 6: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడిచర్లతండా గ్రామపంచాయతీలోని ఖాజాగూడతండాకు చెందిన వివాహిత సభావత్ శారద(24) అదృశ్యమైనట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శారద తిరిగి ఇంటికి రాకపోవడతో కుటుంబసభ్యులతో పాటు, బంధువులు, తెలిసిన వారి వద్ద ఆచూకీ తీసినా ఫలితం లేకపోయింది. దాంతో మంగళవారం శారద భర్త కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712568296 ఫోన్‌నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

టీచర్ల డిప్యుటేషన్లు రద్దు చేయాలి

● తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్

కేశంపేట, ఫిబ్రవరి 6: మండలంలో ఉపాధ్యాయ అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కేశంపేట మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లికంటి అంజన్‌రెడ్డి, ఎ.శ్రీకాంత్‌లు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో పోస్టింగ్ పొంది, అధికారులను మేనేజ్ చేసి పట్టణ ప్రాంతాల్లో డిప్యుటేషన్ వేయించుకోవడం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్యాయం చేసినట్లవుతుందన్నారు. కేశంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆంగ్ల టీచర్‌ను ఎక్లాస్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్‌కు డిప్యుటేషన్‌పై పంపి అక్కడ ఉన్న ఆంగ్ల టీచర్‌ను ఎల్‌బీ నగర్ పాఠశాలకు పంపినట్లు వివరించారు. కేశంపేట పాఠశాలలోని విద్యార్థులకు ఆంగ్లంను ఎస్జీటీతో చెప్పిస్తున్నారని తెలిపారు. మండలంలోని లేమామిడిలో ప్రాథమిక పాఠశాల టీచర్ శ్యామలాదేవి, నాగుర్లగడ్డ తండా టీచర్ శశికళ, బలిజరాళ్ల తండా టీచర్ ప్రశాంతి, కొత్తపేట టీచర్ సరిత, నానుతండా బాలనర్సమ్మ, యూపీఎస్ లింగంధన టీచర్ రాజవర్ధన్‌రెడ్డి, యూపీఎస్ పోమాల్‌పల్లి టీచర్ లక్ష్మణ్, జడ్పీహెచ్ఎస్ ఎక్లాస్‌ఖాన్‌పేట టీచర్ స్వరూప, జడ్పీహెచ్ఎస్ పాపిరెడ్డిగూడ టీచర్లు కవిత, శ్రీలక్ష్మి, జడ్పీహెచ్‌ఎస్ నిర్దవెల్లి టీచర్ బొందయ్య, యూపీఎస్ తొమ్మిదిరేకుల టీచర్ కవితలు డిప్యుటేషన్‌లో హైదరాబాద్ నగర ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అధికారుల డిప్యుటేషన్లను రద్దుచేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

'ఈపాస్'తోనే ఎరువులు విక్రయించాలి

చౌదరిగూడ, ఫిబ్రవరి 6 : ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు ఈపాస్ మిషన్ల ద్వారానే ఎరువులు విక్రయించాలని షాద్‌నగర్ వ్యవసాయాధికారి రాజారత్నం సూచించారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని జిల్లేడ్‌లో యాసంగిలో సాగుచేసిన పంటలను సర్వేనంబర్ల వారీగా తిరిగి పరిశీలించి ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు అగ్రో సేవ కేంద్రం-1లోని రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు రైతులకు ఎరువులను ఈపాస్ మిషన్ల ద్వారానే అమ్మకాలు జరపాలన్నారు. యాసంగిలో ఎరువుల బస్తాల కొరత తేకుండా అందుబాటులో ఉంచాలన్నారు.

విద్యాశాఖ కార్యదర్శిని కలిసిన ఎంపీ రాములు



సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రాములు

ఆమనగల్లు, ఫిబ్రవరి 6: కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ ను మంగళవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో కలిసి పార్లమెంట్ పరిధిలో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు గురించి వినతిపత్రం అందజేశారు. అందుకు సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ రాములు తెలిపారు. అదేవిదంగా కేంద్ర టూరిజం కార్యదర్శి విద్యావతిని కలిసి నియోజకవర్గంలో పర్యాటకం అభివృద్ధి గురించి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కల్వకుర్తి జడ్పీటీసీ భరత్ కుమార్, తదితరులున్నారు.

'సీఎం హోదాలో రేవంత్ చిల్లర మాటలు సరికాదు'

కడ్తాల్, ఫిబ్రవరి 6: ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర కలలు సాకారం చేసిన మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడటం, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కడ్తాల జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్‌లు అన్నారు. అబద్దాల ప్రచారాలతో ప్రభుత్వాన్ని నడుపాలని సీఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలోని జడ్పీటీసీ నివాసంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం హోదాలో హుందాతనంగా వ్యవహరించాల్సిన రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేయాల్సిన సీఎం, ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్ర అద్భుత విజయాలు సాధించిందని వారు పేర్కొన్నారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులు అప్పగించేందుకు కేసీఆర్ సంతకం చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి అబద్దాల మాటలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు జోగు వీరయ్య, కృష్ణ, శ్రీను, లక్ష్మణ్ నాయక్, తదితరులున్నారు.

అంబటి ప్రభాకర్ సేవలు అభినందనీయం : ఎంపీపీ



మాజీ సర్పంచ్ ప్రభాకర్, పాలకవర్గ సభ్యులను గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

కొత్తూర్, ఫిబ్రవరి 6: ఎస్‌బీ పల్లి తాజా మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ గ్రామానికి చేసిన సేవలు అభినందనీయమని ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీ పల్లి గ్రామపంచాయతీ తాజా మాజీ పాలకవర్గ సభ్యులతో పాటు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లకు గ్రామస్తులు, యువకులు మంగళవారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించి గజమాలతో పాటు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ పాలకవర్గసభ్యులు సన్మానించి మాట్లాడుతూ అంబటి ప్రభాకర్ సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ నిధులతో పాటు, లక్షలాది రుపాయల సొంత ఖర్చులతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచారన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని పదవులు చేపట్టాలని కోరారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఐదేళ్లపాటు గ్రామాభివృద్ధితో పాటు, మౌళిక సదుపాయాలు కల్పించి ప్రజల సమస్యలపై నిరంతరం కృషి చేయడం జరిగిందన్నారు. తనకు సంపూర్ణ సహకారాలు అందించిన ప్రజలకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కేశంపేట** : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన నిరుపేద భీమమ్మ మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి అంత్యక్రియల కోసం రూ.5వేలు సమకూర్చగా ప్రతినిధులు బాధిత కుటుంబా నికి అందించారు. నాయకులు సుందరయ్య, యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి** : మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతికి దైవ కార్యక్రమాలు దోహద పడుతాయని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవితం పొందుతారని అన్నారు. ఊర్కొండ పేట అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని శ్రీనివాస్‌యాదవ్ సందర్శించారు. రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● **కడ్తాల్** : ఆరు గ్యారంటీ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గృహజ్యోతి పథకం కింద 200ల లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచే గృహజ్యోతి పథకం అమలులోకి వస్తుందని చెప్పారు. రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్లు కూడా అందించడానికి ప్రభుత్వం కార్యచరణ రూపొందించిందన్నారు. కులగణనకు రేవంత్‌రెడ్డి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

● **కందుకూరు** : మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో ఐదేళ్లపాటు ప్రజాసేవ చేసిన సర్పంచ్‌లకు నేడు(బుధవారం) ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకట్రాములు తెలిపారు. ఎంపీపీ మంద జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి జడ్పీచైర్ పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే సబిత వస్తున్నట్లు తెలిపారు.

● **షాద్‌నగర్ రూరల్** : షాద్‌నగర్ బస్టాండ్‌లో ప్రమాదాల నివారణపై కళాకారుల బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బృందంసభ్యులు పాటలు, ఆటల రూపంలో ప్రదర్శన చేపట్టారు. ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మొక్కలు నాటుతున్న కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఆమనగల్లు పట్టణంలో అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ సేవాదల్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, డీసీసీ నాగర్‌కర్నూల్ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, జిల్లా నాయకుడు రవీందర్ నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పట్టణంలో పలుచోట్ల మొక్కలు నాటారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డిని నాయకులు గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అంబర్‌సింగ్, ఈశ్వర్‌నాయక్, శ్రీరాములు, నరేందర్, కానుగుల దశరథం, యాదయ్య, కాలె మల్లయ్య, కృష్ణనాయక్, అలీం, పూసల సత్యం, పాండు, రాజశేఖర్, తిరుపతి, మల్లేశ్, శివ, హరిలాల్, నాజర్, కృష్ణ, జంతుక యాదయ్య, సురేశ్, కుమార్, ఎంగళి ప్రసాద్, రాఘవేందర్, తదితరులున్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

యాచారం, ఫిబ్రవరి 6 : ఫార్మాసిటీ విషయంలో అండగా ఉన్నారని, మాకు అదే పదివేలు అని మండలంలోని తాటిపర్తి గ్రామస్తులు తాజా మాజీ సర్పంచ్ దూస రమేష్‌ను అభినందించారు. మంగళవారం తాటిపర్తికి చెందిన పలువురు గ్రామస్తులు దూస రమేష్‌ను పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఘనంగా సత్కరించారు. తాము విషం వెదజల్లే ఫార్మాసిటీ రద్దు చేయాలని కోరితే సర్పంచ్ అండగా ఉండి ఆదుకున్నారని గ్రామస్తులు గుర్తుచేశారు. పొలాలు ఉంటేనే మా బతుకులు బాగు పడతాయని అన్నారు.

